క్లుప్తంగా

కంటి వెలుగు శిబిరం ప్రారంభం



హుజూరాబాద్: పట్టణంలోని 16వ వార్డులో శుక్రవారం కంటి వెలుగు శిబిరాన్ని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ... అర్హులు కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, కౌన్సిలర్లు మారెపల్లి సుశీల, కమిషనర్ సమ్మయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు ఖలీద్ తదితరులు ఉన్నారు.

పాఠశాల తనిఖీ



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ గ్రామం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శుక్రవారం డీఈవో సీహెచ్ వీఎస్ జనార్దన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. 9, 10వ తరగతి విద్యార్థులకు వివిధ విషయాలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల భాషా సామర్థ్యాలను అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి పరీక్షలకు సంబంధించి పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో నోడల్ అధికారి అశోక్‌రెడ్డి, హెచ్‌ఎం అంజయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ



ప్యాడ్‌లు అందుకుంటున్న విద్యార్థులు

జమ్మికుంట: పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు, రిటైర్డ్ టీచర్ గంగిశెట్టి జగదీశ్వర్ శుక్రవారం పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేద విద్యార్థులకు చదువు విషయంలో సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పన్నుల వసూలు బాధ్యతగా నిర్వర్తించాలి



మాట్లాడుతున్న కమిషనర్ సమ్మయ్య

జమ్మికుంట: మున్సిపల్ పరిధిలోని వ్యాపార, వాణిజ్య సముదాయాలకు సంబంధించిన పన్నుల వసూలు బాధ్యతగా నిర్వర్తించాలని మున్సిపల్ కమిషనర్ ఎస్. సమ్మయ్య అన్నారు. శుక్రవారం రాత్రి మున్సిపల్ కార్యాలయంలో అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మున్సిపల్‌కు సంబంధించి ఆర్థిక లావాదేవీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పన్నుల విషయంలో ఎప్పటికప్పుడు డబ్బులు జమ చేయాలని సూచించారు. విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విలేకరిపై కేసు నమోదు

ఇల్లందకుంట: దళితబంధులో వచ్చిన ట్రాక్టర్‌ను వాడాలంటే డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేసిన విలేకరిపై ఇల్లందకుంట పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. ఎస్సై తోట తిరుపతి తెలిపిన వివరాలు..బూజునూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి దళితబంధులో మంజూరైన ట్రాక్టర్ రోడ్డుపై నడపాలంటే రూ.10,000 ఇవ్వాలని, లేదంటే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసి జీవనోపాధి లేకుండా చేస్తానని మండలానికి చెందిన ఓ దినపత్రిక(సాక్షి కాదు) విలేకరి భయభ్రాంతులకు గురిచేశాడని తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని ఎస్సై పేర్కొన్నారు.

మూణ్నాళ్ల ముచ్చటే..

- మానకొండూర్ మండల కేంద్రంలోని పెద్దచెరువు కట్టపై పగుళ్లు
- మినీ ట్యాంక్‌బండ్ పనులు అసంపూర్తి
- బ్యూటిఫికేషన్ పనులకు మోక్షమెన్నడో..?



చెరువుకట్టపై ఏర్పడిన పగుళ్లు

మానకొండూర్: మండల కేంద్రంలోని పెద్ద చెరువును మినీ ట్యాంకుబండ్‌గా ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అయితే ట్యాంక్ బండ్ కట్ట మున్నాళ్లకే పగుళ్లు బారింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత మానకొండూర్ చెరువును మినీ ట్యాంకుబండ్‌గా చేశారు. సుమారు ఐదున్నర కోట్లపైగా నిధులతో చెరువుకట్టను వెడల్పు చేసి సీసీరోడ్డు వేశారు. టర్ఫోవాల్స్ ఏర్పాటు చేసి పచ్చని గడ్డిని పరిచారు. చెరువుకట్టపై రెయిలింగ్, తూములు, బండరాళ్లతో తెట్టే, మొదలగు పనులు చేపట్టారు. ఇక బ్యూటిఫికేషన్ పనులు చేపట్టాల్సి ఉంది. అయితే చెరువుకట్ట మాత్రం పగుళ్లు బారుతోంది. సుమారు కిలోమీటరు మేర చెరువుకట్టపై సీసీరోడ్డు పగుళ్లు బారుతుండటంతో నాణ్యతాలోపం బయటపడిందని, చెరువుకట్టకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలతో భయానకంగా తయారైందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పచ్చని గడ్డి, విద్యుత్ కాంతులతో ట్యాంకు బండ్ ఎంతో సుందరంగా ఉంటుందనుకున్న ప్రకృతి ప్రేమికుల ఆశ నిరాశే అయింది. రెయిలింగ్ ఎక్కడికక్కడే తుప్పుపట్టి కింద పడిపోయింది. మినీట్యాంకు బండ్‌ను సుందరంగా తయారు చేసేందుకు సుడా రూ.2 కోట్ల నిధులు వెచ్చించినా ఇంతవరకు పనులు ప్రారంభం కాలేదు. టెండర్ దశలోనే ఉండటంతో బ్యూటిఫికేషన్ పనులు మరింత ఆలస్యం కానున్నాయని ఆయా పార్టీల నాయకులు అంటున్నారు.



కిందపడిన రెయిలింగ్

రైతులకు నష్ట పరిహారం అందించాలి



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న సంపత్‌రావు

జమ్మికుంట: అకాల వర్షాలకు మండలంలోని మొక్కజొన్న, వరి పంటలు నేలకొరగడంతో రైతులకు నష్టం వాటిల్లిందని, నష్ట పరిహారం అందించాలని కాంగ్రెస్ నాయకుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు శుక్రవారం డిమాండ్ చేశారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే సీఎం కేసీఆర్ రైతులను ఆదుకోవాలని, కాంగ్రెస్ హయాంలో రైతులకు పంట నష్టపోతే పరిహారం అందించి ఆదుకుందని గుర్తు చేశారు. అధికారులు పంట నష్టంపై అంచనా వేయాలన్నారు. పరిహారం అందించకుంటే రాబోయే రోజుల్లో రైతులతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

ఇల్లందకుంట: పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబెల్లి సంపత్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో అకాల వర్షానికి నేల కొరిగిన మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అకాల వర్షంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, తొమ్మిదేళ్లుగా ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోలేదని, ఫసల్‌బీమా పథకాన్ని రా ష్ట్రంలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ గౌత మ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, నాయకులు పవన్ రెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, అజయ్, తిరుపతి రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలుచేయాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

గన్నేరువరం: రుణమాఫీ అమలు చేయాలని కోరుతూ మండలంలో సీపీఐ నాయకులు శుక్రవారం తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతులకు ఒకేసారి రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇళ్లు మంజూరు చేయాలని, ప్రభుత్వం ఇస్తానన్న మూడు లక్షల రూపాయలు సరిపోవని ఐదు లక్షలు ఇవ్వాలని కోరారు. ఇప్పటివరకు ఎస్టీ, ఎస్సీ, బీసీ రుణాలు మంజూరుపై ప్రభుత్వ స్పందించాలన్నారు. అకాల వర్షంతో పంటలకు నష్టం వాటిల్లిందని సర్వే చేసి నష్టపరిహారం ఇవ్వాలని, గ్రామాల్లో పూర్తిస్థాయిలో రేషన్ డీలర్లను నియమించాలన్నారు. రేషన్‌కార్డులో పేరు నమోదుకు ఆప్షన్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి శ్రీశైలం, కోశాధికారి శ్రీనివాస్, నాయకులు మల్లయ్య, పబ్బాతి సాగర్ రెడ్డి, రామంచ మల్లేశం, కూన మల్లయ్య, కూన పవన్ ,బట్టు పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

31లోగా ఆస్తిపన్ను చెల్లించండి

- మున్సిపల్ అదనపు కమిషనర్ స్వరూపారాణి



నోటీసులు ఇస్తున్న మున్సిపల్ అధికారులు

కరీంనగర్‌సిటీ: ప్రజలు ఆస్తిపన్ను చెల్లించి, నగరపాలక సంస్థ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ అదనపు కమిషనర్ స్వరూపారాణి కోరారు. పురపాలక చట్టం 2014 నియమ నిబంధనల ప్రకారం కరీంనగర్ నగరపాలక సంస్థ రెవెన్యూ బృందం ఆస్తి పన్ను మొండి బకాయిదారులపై కొరఢా ఝులిపించేందుకు సిద్ధమైంది. సీడీఎంఏ, నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, కమిషనర్ సేవా ఇస్లావత్‌ల ఆదేశాల మేరకు రెవెన్యూ విభాగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. నగరంలో కొన్నేళ్లుగా పన్ను చెల్లించకుండా మొండి బకాయిదారులుగా ఉన్న పలువురి ఇళ్లు, దుకాణాల వద్దకు శుక్రవారం అదనపు కమిషనర్ స్వరూపరాణి, రెవెన్యూ అధికారులు వెళ్లారు. గతంలో చాలాసార్లు నోటీసులు ఇచ్చినా స్పందించలేదని, మరోసారి ఇచ్చారు. మార్చి 31న ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నందున ఆలోగా పన్నులు చెల్లించాలని చెప్పారు. లేకపోతే పురపాలక చట్టం ప్రకారం మొండి బకాయిదారులకు వారెంట్లు జారీ చేసి, వారి ఇళ్లకు తాళాలు వేయడంతోపాటు విలువైన వస్తువులు లేదా ఆస్తులను జప్తు చేస్తామని హెచ్చరించారు. ఇంటి, నల్లా, ట్రేడ్ లైసెన్స్ పన్నులు సకాలంలో చెల్లించాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ విభాగం అధికారి ఆంజనేయులు, ఆర్ఐ రషీద్, బిల్ కలెక్టర్లు, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

కరీంనగర్ క్రైం: నగరంలోని మీనాక్షి ఆసుపత్రిలో కరీంనగర్ ఫైర్ అధికారులు శుక్రవారం అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలను వివరించారు. ఈసందర్భంగా స్టేషన్ ఫైర్ అధికారి పరమేశ్వర్ ఆసుపత్రి నిర్వాహకులు, వైద్యులు, సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఫైర్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాలపై విద్యార్థులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి సుజయ్

శంకరపట్నం: మండలంలోని కన్నాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శుక్రవారం చట్టాలపై కరీంనగర్ న్యాయస్థానం సీనియర్ సివిల్ జడ్జి సుజయ్ అవగాహన కల్పించారు. లీగల్‌సెల్ అథారిటీ ఆధ్వర్యంలో కేసులపై న్యాయసలహాలు పొందవచ్చన్నారు. పేదరికంతో న్యాయవాదిని నియమించుకోలేని వారికి లీగల్‌సెల్ ఉచితంగా న్యాయ సహాయం చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, హెచ్‌ఎం శ్రీనివాస్, న్యాయవాదులు మహేశ్, సురేశ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, వార్డు సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హమాలీ సంఘం గౌరవ అధ్యక్షుడిగా పింగిళి రమేశ్



సన్మానిస్తున్న హమాలీ కార్మికులు

జమ్మికుంట: జమ్మికుంట హమాలీ వర్కర్స్, లేబర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడిగా పింగిళి రమేష్‌ను శుక్రవారం ఎన్నుకున్నామని యూనియన్ అధ్యక్షుడు ఒల్లాల శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సమస్యలపై అనుభవం ఉన్న మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, హమాలీ సంఘం మాజీ అధ్యక్షుడు, ప్రస్తుతం కేడీసీసీ బ్యాంక్ జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా పింగిళి రమేశ్ కొనసాగుతున్నారని అన్నారు. అనంతరం ఆయనకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో హమాలీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

టీ షర్ట్స్ అందజేత



టీషర్ట్స్ అందిస్తున్న చందు, కనకరాజు

రామడుగు: మండల కేంద్రంలోని క్రికెట్ క్రీడాకారులకు గ్రామానికి చెందిన మాదం చందు, రాగం కనకరాజు శుక్రవారం టీ షర్ట్స్ అందజేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులు ఆటలో మంచి ప్రతిభ కనబరచాలని కోరారు.

కార్యకర్తలు, రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటాం

ఎమ్మెల్యే రవిశంకర్



చొప్పదండి: చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే

రామడుగు: బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామంలో శుక్రవారం కరెంట్ షాక్‌తో మృతిచెందిన ఊరడి సుదర్శన్ (బీఆర్ఎస్ కార్యకర్త) కుటుంబ సభ్యులకు రూ.రెండు లక్షల ప్రమాద బీమా చెక్కు, కంకణాల రఘు అనే రైతు అనారోగ్యంతో మృతి చెందగ రూ. ఐదులక్షల రైతుబీమా చెక్కు ఆయన కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతు బీమా పథకం ద్వారా మృతిచెందిన రైతుల కుటుంబాలకు భరోసా కల్పిస్తోందని, దేశానికి పథకం ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. కార్యక్రమంలో గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ తవుటు మురళీ, ఎంపీటీసీ వంచ మహేందర్‌రెడ్డి, సర్పంచ్ కోల రమేష్, రైతుబంధు కమిటీ మండల కోఆర్డినేటర్ జూపాక కరుణాకర్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎల్కపల్లి లచ్చయ్య పలువురు పాల్గొన్నారు.

ఆడబిడ్డలకు సర్కారు కానుక కల్యాణలక్ష్మి

చొప్పదండి: రాష్ట్రంలోని ఆడబిడ్డలకు ప్రభుత్వం కల్యాణలక్ష్మి కానుక అందించి పేదింటి బిడ్డలను ఆదుకుంటోందని ఎమ్మెల్యే అన్నారు. క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మండలానికి చెందిన 67 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. చిట్యాలపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళకు రెండు చెక్కులు అందజేశారు. ఇద్దరు బిడ్డల పెళ్లికి సర్కారు సాయం చేయడం పట్ల కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చిలుక రవీందర్, ఏఎంసీ చైర్మన్ గడ్డం చుక్కరెడ్డి, వైస్ చైర్మన్ చీకట్ల రాజశేఖర్, బీఆర్ఎస్ మండలశాఖ అధ్యక్షుడు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏబీవీపీ నాయకులు

చొప్పదండి: మండల కేంద్రంలోని మార్కెట్ చౌరస్తాలో శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈసందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రేషవేని వేణు మాట్లాడారు. టీఎస్‌పీఎస్సీ నిర్లక్ష్యానికి నిరసనగా దిష్టిబొమ్మ దహనం చేశామన్నారు. లక్షలు పెట్టి కోచింగ్ తీసుకున్న విద్యార్థులకు విలువ లేకుండా చేశారని, విద్యార్థుల ఉసురు పోసుకున్నారని, సీబీఐ లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, ప్రశాంత్, శ్రీనివాస్, జాప కుమార్, అజయ్, రాజు, సాగర్, రంజిత్, కళ్యాణ్, మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను బర్తరఫ్ చేయాలి

ప్రశ్నపత్రాల లీకేజీలో టీఎస్‌పీఎస్సీ చైర్మన్‌ను వెంటనే బర్తరఫ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మచ్చ రమేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ ముప్పై లక్షల మంది నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడిన చైర్మన్‌పై సీఎం కేసీఆర్ స్పందించకపోవడం దారుణమన్నారు. సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. పీడీ యాక్ట్ నమోదు చేసి జైల్లో వేయాలని, లేకుంటే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

నర్సరీని పరిశీలించిన డీఆర్‌డీవో



నర్సరీని పరిశీలిస్తున్న డీఆర్‌డీవో శ్రీలతారెడ్డి

శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెం గ్రామంలోని నర్సరీని శుక్రవారం డీఆర్‌డీవో శ్రీలతా రెడ్డి పరిశీలించారు. నర్సరీలోని మొక్కలకు నీరు పట్టాలని, వేసవిలో మొక్కలు ఎండిపోకుండా నెట్ షెడ్డు ఏర్పాటు చేయాలని సూచించారు. మండలంలోని కేశవపట్నం నర్సరీని ప్రత్యేక అధికారిని సునీత పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో బషీరొద్దీన్, ఏపీవో శారద, టెక్నికల్ అసిస్టెంట్ అశోక్, కార్యదర్శులు నర్సయ్య, గురువయ్య, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలి



మాట్లాడుతున్న రమేశ్‌కుమార్

కరీంనగర్: ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు ప్రవేశపెట్టాలని మాదిగ రాజకీయ పోరాట సమితి, ఎమ్మార్పీఎస్ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బీఎస్ రమేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మాతంగి రమేశ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేస్తామని హామీ ఇచ్చిన బీజేపీ అధికారంలోకి వచ్చి తొమ్మిదేళ్లవుతున్నా పట్టించుకోవడం లేదన్నారు. ఈ పార్లమెంటు సమావేశాల్లో వర్గీకరణ బిల్లు పెట్టి, మాదిగ, మాదిగ ఉపకులాలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. లేనిపక్షంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఇతర దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ నాయకులను అడ్డుకుంటామని హెచ్చరించారు. సీఎం కేసీఆర్ ఎస్సీ వర్గీకరణ కోసం అఖిలపక్షాన్ని ఢిల్లీ తీసుకెళ్లాలని, కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీఎస్, ఎంఎంఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు వెంకటస్వామి, సారంగపాణి, కొమురక్క, చిరంజీవి, కుమార్, విల్సన్, ఆకాశ్, రమేశ్, పవన్‌కల్యాణ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న శేఖర్

కరీంనగర్: అర్హులైన పేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలివ్వాలని ఏఐఎఫ్‌బీ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కరీంనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సొంత జాగా ఉన్నవారికి ఇంటి నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం ద్వారా ఇచ్చే రూ.3 లక్షలు సరిపోవన్నారు. సిమెంటు, ఇసుక, ఇటుక, ఇనుము ఇతర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. రాష్ట్ర సర్కారు రూ.5 లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు ఇవ్వాలని కోరారు. జీవో నంబర్ 58ని వెంటనే అమలు చేసి, పేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలివ్వాలన్నారు. కొంతమంది భూమాఫియా, రియల్ ఎస్టేట్ వ్యాపారులు కరీంనగర్ చుట్టుపక్కల ప్రభుత్వ భూములను కబ్జా చేశారని ఆరోపించారు. వాటిని 59 జీవో ద్వారా క్రమబద్ధీకరిస్తే ఊరుకునేది లేదన్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బెక్కంటి రమేశ్, జి.ప్రశాంత్ కుమార్, నాయకులు రాజు, ప్రశాంత్, శ్యాం తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

కాచాపూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన

శంకరపట్నం: మండలంలోని కాచాపూర్ ఎస్సీకాలనీలో శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. కాలనీ వాసులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవంలో సర్పంచ్ రాజయ్య, తదితరులు ఉన్నారు.

మానకొండూర్‌లో...



మానకొండూర్: పూజలు చేస్తున్న సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు

మానకొండూర్: మండల కేంద్రంలోని పురాతన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయ ద్వారపాలక-సుదర్శన ప్రతిష్ఠ సహిత అష్టోత్తర శత ఘటాభిషేక మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రముఖ జ్యోతిష్య, వాస్తు, ఆగమ శాస్త్ర పండితులు నమిలకొండ రమణాచార్యస్వామి ఆధ్వర్యంలో వివిధ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ జీవీ రామకష్ణారావు, జెడ్పీటీసీ శేఖర్‌గౌడ్, సీఐ రాజకుమార్, ఎంపీటీసీలుకవిత, సులోచన, ఉపసర్పంచ్ మురళి, ఎంపీటీసీలు, భక్తులు, గ్రామస్తులున్నారు.

దళితబంధు యూనిట్ ప్రారంభం



హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సింగాపూర్ గ్రామంలో దళితబంధు పథకం ద్వారా మంజూరైన యూనిట్‌ను శుక్రవారం హుజూరాబాద్ సింగిల్ విండో చైర్మన్ ఎడవెల్లి కొండల్‌రెడ్డి, ధర్మారం సింగిల్ విండో చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి ప్రారంభించారు.